


హరిశ్చంద్రరావ్ అసహనంగా కదిలాడు. దాదాపు రెండు గంటల్నించి పక్కమీద దొర్లుతున్నాడు. కాని నిద్ర పట్టలేదు. కళ్ళు తెరిచాడు. బెడ్‌ల్యాంప్ కాంతి పలచగా గదంతా వ్యాపించివుంది. ఆతని మంచానికి కాస్త దూరంలో అతని భార్య అదమరచి నిద్రపోతోంది. ఆవిడ పక్కలో తల్లిని కావలించుకుని పడుకొంది పన్నెండేళ్ళ కూతురు.

హరిశ్చంద్రరావ్ బ్యాంకులో ఆఫీసర్. అలా అని అతని జీవితం ఇతరు లనుకునేంత సుఖంగా లేదు. అతనికి కనీసం సెకండ్‌హ్యాండ్ స్కూటరైనా లేదు. చిన్న యిల్లు లేదు. బ్యాంకు బ్యాలెన్సు

అప్పులు లేదు. అతనికున్నదల్లా ఆరువేల అప్పు, అన్నికటింగ్సూ పోను ఆరొం దల జీతం! ఆదరాబాదరా పెరిగిపోతున్న ఆడకూతురు, మనసులో బోల్డంత దిగులు. బ్యాంకుల్లో పనిచేసేవాళ్ళ జీవితం చాలా ఖుషీగా వుంటుందనుకుంటారు చాలా మంది. కాని అది మేడిపండులాంటిదని చాలా తక్కువ మందికే తెలుసు

"ఆర్టీసీవాళ్ళకి, రైల్వే వాళ్ళకి ప్రయాణం ఉచితం! అలాగే బ్యాంకుల్లో పనిచేసేవాళ్ళకి డబ్బులు ఫ్రీ అంటే ఎంత బాగుణ్ణు" అని చాలాసార్లనుకున్నాడు హరిశ్చంద్రరావ్. ఒకవేళ అలా ఫ్రీగా డబ్బొచ్చినా హరిశ్చంద్రరావ్ తీసుకో లేడని యివ్వాళ ఋజువైంది. అతను చాలా ముక్కుసూటి మనిషి! అతని సూదిలాంటి ముక్కు అతని గుణానికి గొప్ప సింబాలిజమ్!

అతనలా భార్యని చూస్తుండగానే ఆవిడ "ఛీ" అని అటుప్రక్కకు తిరిగి పడుకుంది. తన భార్య నిద్రలో కూడా తనని తిట్టుకుంటుందనుకున్నాడు. కాని ఆవిడ ఒక చేత్తో మరో చేతిమీద వాలిన దోమని తోలుకోవడంలో ఆ 'ఛీ' అన్న పదం వచ్చిందని తెలిశాక కాస్త తెప్ప రిల్లాడు.

ఇప్పుడు హరిశ్చంద్రరావ్ వెల్లకిలా పడుకుని రెండుచేతులూ తలక్రింద పెట్టు కుని గోడవంక చూస్తూ పడుకున్నాడు. గోడమీద బాగా బలిసిన బల్లి ఆ మసక వెలుతుర్లో పురుగుల్ని పట్టుకు తింటోంది. ఇంతలో ఒక పురుగు బల్లి కెదురుగా వాలింది. దాని పెద్దపెద్ద రెక్కలు విచి త్రంగా కదుల్తున్నాయి. బల్లి దానివంక చూస్తూ పురుగు గమనించకుండా తన శరీరాన్ని మెల్లమెల్లగా కదిలిస్తోంది. ఆ తర్వాత ఒక్కసారిగా పురుగుమీదికి ఉరికింది. కానీ చిత్రం దానికంటే వేగంగా పురుగు ఎగిరిపోయింది బల్లికి చిక్కకుండా! హరిశ్చంద్రరావ్‌కి ఆ పురుగు తెలివితేటలకి ఆశ్చర్యమేసింది. అంత తెలివిగా తను తప్పించుకోగలడా!

* * *

"మహా చక్కగా తప్పించుకోవచ్చు! లంచాలు తీసుకునేవాళ్ళంతా చిక్కిపోతు న్నారా! అలా అయితే యిప్పుడు ఉద్యో గాలు చేస్తున్నవాళ్ళల్లో నూటికి తొంభై మంది ఉద్యోగాలు పోగొట్టుకుంటారు తెలుసా" అంది భార్య ఆ సాయంత్రం.

"అదికాదు కాంతం...."

""ఏది కాదండీ! అతనెవరో పాతిక వేలు అప్పు కావాలన్నాడు. గుర్రప్పందే లకో, ప్రాకెట్టాటకో కాదుగా అప్పడిగింది. వ్యాపారం చేసుకోవడానికి! పోనీ మీ సొంత డబ్బేమైనా యిచ్చేస్తున్నారా! బ్యాంకుడబ్బే గదా! ఏదో మీకీ ఉపకారం

చేస్తే ప్రతిఫలంగా ఓ వెయ్యి రూపాయ లిచ్చుకుంటానన్నాడు."

"అదికాదు కాంతం! అతని దగ్గర సెక్యూరిటీ లేదు. బ్యాంకు రూల్సొప్పవు గదా!"

"రూల్సట రూల్సు! అసల్ను పాతిక వేల రూపాయల అప్పుకి ఏభై వేల సెక్యూ రిటీ అడిగితే ఎలాగండీ! ఆ ఏభై వేల సెక్యూరిటీయే వుంటే మీ దగ్గరకు రావా ల్సిన ఖర్మ అతనికేం పట్టింది. హాయిగా దాన్నే అమ్ముకోలేడా? అయినా యిదంతా నా ఖర్మ! చేతకాని మొగుణ్ని కట్టుకుని దరిద్రం అనుభవించాల్సిన రాత నా నొసటిమీద రాసుంది. మీరేంచేస్తారు లెండి! మనింటి ప్రక్కన తాతారావు అన్నయ్యగార్ని చూడండి! చేసేది తాలూ కాఫీసులో ఉద్యోగమైనా యింట్లో టీవీ, ఫ్రిజ్, స్కూటర్, ఇల్లూ- అవన్నీ ఎలా వచ్చాయండీ. ఆయన జీతంతోనే సంపా యించేశాడా?" చెప్పుకుపోతోంది భార్య!

* * *

"వెధవజన్మ! 'ఛీ'" అనుకున్నాడు హరిశ్చంద్రరావ్! గోడమీద బల్లి కెదు రుగా మళ్ళీ పురుగువాలి బల్లిని ఉడికి స్తోంది. ఈసారి బల్లి తొందరపడలేదు. పురుగునే చూస్తూ ఆలోచన్లో పడింది. హరిశ్చంద్రరావ్‌కి కలతనిద్ర పట్టింది.

ఆ నిద్రలో....

అతను సెక్రటేరియట్ మీదుగా నడిచి వెళుతున్నాడు. చాలామంది కుర్రవాళ్ల ప్యాంట్ మాత్రం వేసుకుని చొక్కా లేకుండా సెక్రటేరియట్ ముందు ఏవేవో స్లోగన్స్ యిస్తున్నారు, కొందరు రోడ్డుకడ్డంగా పడుకున్నారు. కొందర్ని పోలీసులు వ్యానెక్కిస్తున్నారు. వ్యానెక్కుతున్న కుర్రాళ్ళు, రోడ్డుమీద దొర్లుతున్న కుర్రాళ్ళు, అరుస్తున్న కుర్రాళ్ళు, అందరూ నవ్వు తూనే వున్నారు. ఒకరిముఖంలో గూడా తాము సాధించాల్సిన దానికోసం పడే ఆరాటం లేదు. గంభీరత లేదు! ఇదో రకం విరసన కార్యక్రమం అనుకున్నాడు.

ఇంతలో....

"హరిశ్చంద్రరావ్!"

ఎవరో తనని పిలిచినట్టయింది. వెనక్కితిరిగి చూశాడు. ఎవరూ లేరు. తనకే అలా వినిపించిందేమో ననుకుని మళ్ళీ నడవడం మొదలెట్టాడు.

"హరిశ్చంద్రరావ్! హరిశ్చంద రావ్."

ఈ సారి స్పష్టంగా వినబడింది పిలుపు!

ఒక్క నిమిషం ఆగాడు. ఇంతలో ఒక వ్యక్తి అతని ప్రక్కనే ప్రత్యక్ష మయ్యాడు. ఒంటిమీద చొక్కా లేదు. పట్టుపంచె కట్టాడు. వక్షస్థలమంతా నిగ నిగలాడే వెంట్రుకలు. ఒంటిమీద రక

రకాల ఆభరణాలు! ఏదో పౌరాణిక నాటకం వేస్తూ ప్రేక్షకులు రాళ్లు విసరగా పారిపోయొచ్చినవాడిలా వున్నాడు.

"ఏమిటోయ్! అలా చూస్తున్నావ్? గుర్తుపట్టలేదా!"

తనకి నాటకాలువేసే స్నేహితు లెవ్వరూ లేకపోవటంతో "ఊహుఁ" అన్నాడు తల అడ్డంగా వూపుతూ!

"పోనీ నే నెవర్నయివుంటానో కాస్త ఊహించు" అన్నాడు ఏదో కాంపిటీషన్ పరీక్షలో ప్రశ్న వేస్తున్నట్టు.

చిన్నప్పుడు తన స్కూల్లో తెలుగు మాస్టారొకసారి "నువ్వే రాష్ట్రపతివైతే" అన్న విషయంమీద కాంపోజిషన్ రాయమంటే తన స్నేహితుడొకడు ఒకే మాటలో రాసాడు. "రకరకాల జబ్బుల పేరుతో చికిత్సకోసం ప్రపంచమంతా తిరిగొస్తాను" అని. అలా వుంది ఈ ప్రశ్న! అస్సలీయన్నెక్కడా చూసినట్టే లేకపోతే "ఊహించమంటాడేవిటి అర్థం" అనుకుని "మీరు....మీరు...." అంటూ నసిగాడు.

"చెప్పవోయ్!"

"మీరు.... బహుశా .... అరుగో! అక్కడ చొక్కాల్లేకుండా అరుస్తున్నారు చూడండి వాళ్ళ నాయకుడై వుంటారండీ" అన్నాడు.

"అబ్బే! చాలా తప్పు చెప్పావోయ్!" అన్నాడు తనని గుర్తించనందుకు విచారిస్తూ."

"లేకపోతే" అటూ ఇటూ చూసి "ఇలా దగ్గరగా రండి" అన్నాడు హరిశ్చంద్రరావ్ చెవిలో చెప్పాలన్నట్టుగా.

"బహుశా - ముఖ్యమంత్రి పదవి కోసం ట్రై చేస్తూ రకరకాల వేషాలు వేస్తున్న ప్రజానాయకుడై వుంటారు" అన్నాడు.

"హరిశ్చంద్రరావ్! నువ్వేదో గొప్ప హాస్యం కురిపిస్తున్నావోయ్! నిజానికి నువ్వు బ్యాంకులోకంటే కూడా ఆలిండియా రేడియోలోనో, హైదరాబాద్ దూరదర్శన్‌లోనో వుంటే రాణిస్తావోయ్! చూడూ! నువ్వు నన్ను గుర్తుపట్టటంలో పప్పులో కాలేశావ్! నే నెవర్నో తెలుసా! నీ మేలుకోరి నీకు జ్ఞానబోధ చేయటానికొచ్చిన హరిశ్చంద్రని - రాజా సత్యహరిశ్చంద్రః" అన్నాడు యన్టీఆర్‌లా నవ్వుతూ!

"నిజంగానా?" అన్నాడు హరిశ్చంద్రరావ్ నోరెళ్ళబెడుతూ!

"నూటికి నూరుపాళ్ళు నిజం! నువ్వు ప్రస్తుతం చాలా క్లిష్టపరిస్థితిలో వున్నావని వచ్చాను. నువ్విలా ట్యాంక్‌బండ్ కేసి నడుస్తుంటే భయమేసి మధ్యలో కేకేసాను. సర్లేరా! అలా ఏదైనా పార్కుకెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు సత్యహరిశ్చంద్రుడు. అచ్చం మనం మాట్లాడుకున్నట్టే మాట్లాడుతున్నందుకు హరిశ్చంద్రరావ్ చాలా ఆశ్చర్యపోయి అతనితో నడిచాడు.

* * *

"అదండీ సంగతి! నా భార్యటుంది పీ సొమ్ము కాదు గదా అప్పిచ్చేది పీ సొమ్మేంపోయే అంటుంది. కాని రూల్సొప్పవ్ గదండీ."

"చూడు హరిశ్చంద్రరావ్! మీ బ్యాంకు రోజూ ఎన్నిగంటలవరకు పన్జేస్తుంది!" అన్నాడు హరిశ్చంద్రుడు.

"అయిదున్నరదాకా."

"అదికాదు బిజినెస్ అవర్స్ ఏదో అంటారుగా అదీ!"

"రెండున్నర వరకూ."

"నేను లక్షరూపాయలు డిపాజిట్ చేయటంకోసం మూడుగంటలకి తెచ్చానమకో మీరు తీసుకుంటారా లేదా!"

"తీసుకుంటాం,"

"మరి రూల్సుప్రకారం రెండున్నర వరకే గదా మీ బ్యాంకు!"

"ఇది వేరు సార్! చూస్తూచూస్తూ లక్షరూపాయల డిపాజిట్ ఏ బ్యాంకరూ వదులుకోడు! ఎంతైనా బ్యాంకు కూడా బిజినెస్సే గదండీ."

"చూసావా! యీ విషయంలో రూల్సు మారిపోయాయి. అయినా రూల్సనేవి మనం అనుకోవటంలో వుందయ్యా! అద్సరే! మీ భార్య లంచం తీసుకోమంటుందంటున్నావ్! మరి పీ అభిప్రాయమేమిటి!"

"అమ్మో ఎవరికైనా తెలిసిందనుకోండి! ఫలానా ఆఫీసర్ లంచాలు తింటున్నాడని నలుగురూ గోలగోల చెయ్యరూ!"

"అంటే! ఎవ్వరూ చెప్పుకోకుండా గోలగోల చేయకుండావుంటే తీసుకుంటావన్నమాట!"

"అబ్బే! అబ్బే! అదికాదు నా ఉద్దేశ్యం!"

"చూడు హరిశ్చంద్రరావ్! మనిషి కెప్పుడూ రెండు ఆలోచన్లు వుంటాయయ్యా! ఒకటి సంఘపరమైంది, అంటే నలుగురూ ఏమనుకుంటారోనని తన ఆలోచన్లు మార్చుకుంటుంటాడు. రెండవది వ్యక్తిగతం - తనకి తోచినట్లు చేయడం! కాని వ్యక్తిగత ఆలోచన్లు సంఘపరమైన ఆలోచన్లతో జతచేసి లాభంపొందినవాడే మేధావి."


"మీరు చెప్పేదేమీ నా కర్థం కావటం లేదు" బుర్ర గోక్కున్నాడు.

"వస్తున్నా వస్తున్నా! నా విషయం తీసుకో! ఇప్పటి మానవులంతా నా గురించి ఏమనుకుంటారు!"

"సత్యహరిశ్చంద్రుడని."

"అవునా! అంటే నే నబద్ధం ఆడను. అది నా స్పెషాలిటీ! ఇది ప్రజలందరికీ తెలిసింది కాని నాకు మాత్రమే తెలిసినవి కొన్ని వున్నాయ్" అన్నాడు.

"అంటే!"




"అంటే మీరంతా సత్యహరిశ్చంద్రుడని అనుకునేట్టు నేను చేయడం సంఘపరమైన ఆలోచన! దాని వెనుక నిగూఢంగా వున్నది నా వ్యక్తిగత ఆలోచన అర్థమైందా!"

"నా బొంద నాకేమీ అర్థంకావటేదు. ఎకౌంట్సు నేర్చుకునేవాడికి ఆంత్రోపాలజీ చెపితే ఎంతర్థమవుతుందో అలా వుంది నా పరిస్థితి."

హరిశ్చంద్రుడు చిన్నగా నవ్వాడు మీసం దువ్వుకుంటూ.

ఇంతలో మీసంకింద ఓ దోమ కుట్టింది. "అబ్బా! వెధవదోమ! ఏమోయ్! మీ గవర్నమెంట్ పార్కుల్లో దోమల మందు చల్లరా!"

"ఏమోనండి మరి! నాకు తెలిసినంత వరకూ యీ హైద్రాబాద్‌లో టెలిఫోన్స్ వాళ్ళు రోడ్లు తవ్వి వదిలేయడం, పార్కుల్లో దోమలు కుట్టడం, ఆఫీసు టైముల్లో ట్రాఫిక్ జామయిపోవడం, పండగ సీజన్లో పాతబస్తీలో కర్ఫ్యూ రావటం చాలా సాధారణ విషయం!"

"అదిసర్లే! చూశావూ! యీ పెళ్ళాలున్నారే వాళ్ళతో గొప్ప డేంజరోయ్! విపరీతంగా దోమలున్న గదిలో కనీసం ఫ్యాను, దోమతెర లేకుండా నిద్రపోవడం ఎంత చిరాకో అంతకంటే గొప్ప చిరాకు పెళ్ళాం అనేది."

"చంద్రమతీదేవి గొప్ప పతివ్రతురాలు గదండీ!"

"నేనుమాత్రం కానా సత్యహరిశ్చంద్రుణ్ణి! అదికాదోయ్ హరిశ్చంద్రరావ్!

యూ అతవాళ్ళకి ఎంత పెద్ద హోదా వచ్చినా ఆ బంగారంపిచ్చి వదలదోయ్! ఎంతసేపూ నగలు, బంగారం, దర్జా యివే ఆలోచన్లు ...!

"అబ్బ! ఏటి గురించి తర్వాత చెప్పుదురూ! విషయం చెప్పండి."

"సరే! అలా ఒక పెళ్ళాంతోనే తృప్తిగా వుంటే విశ్వామిత్రుడు తన మాయా కుమార్తెల్ని తీసికొచ్చి పెళ్ళిచేసుకుంటావా! రాజ్యమిచ్చేస్తావా! అన్నాడు. నేను బాగా ఆలోచించి రాజ్యం వదులుకుంటేనే సుఖమనుకుని రాజ్యమిచ్చేశాను. అప్పుడన్నా సుఖముంటుందని. కాకపోతే దర్జాగా బ్రతికే జీవితం పోయిందని కొంత బాధపడ్డాననుకో. అదేమంత పెద్ద విషయం కాదు. ఆ విధంగా రాజ్యం పోయినా పెళ్ళాం మాత్రం వదల్లేదు. తప్పదుగదా! దేశమంతా బయల్దేరాం! మా వెంట వాడొకడూ- ఎవడూ" ప్రశ్న వేశాడు హరిశ్చంద్రరావ్ వింటున్నాడో లేదోనని.

"నక్షత్రకుడు."

"వెరీగుడ్! వాడికీ మీ ఇన్‌కంటాక్సు వాళ్ళకీ ఏమీ తేడా లేదోయ్! ఎంతిచ్చినా యింకా ఏదో కావాలంటాడు. కానీ వాడు నాకొక గొప్ప మేలు చేశాడులే! వాడి బాధపేరుతో ఉన్న పెళ్ళాన్ని అమ్మేసాను. మీరంతా "ఆహా! ఓహో!" అనుకున్నారు. నేనుమాత్రం అటు పెళ్ళాన్ని వదుల్చుకున్నందుకూ, ఇటు ప్రజల్లో కీర్తి వచ్చినందుకూ లోపల్లోపల సంతోషించాను."

"కాని సార్! అప్పుడంటే చెల్లింది గాని, ఇప్పుడు పెళ్ళాన్ని అమ్మితే ఉత్తరప్రదేశ్‌లో ఫ్లెష్‌ట్రేడ్, ఆంధ్రకి కూడా పాకిందని అరెస్టుచేసి పారేస్తారు తెలుసా!"

"అబ్బ! నే చెప్పేది వినవోయ్! ఆ తర్వాత నేనేం చేశాను. కాటికాపర్నయ్యాను. ఆ ఉద్యోగంలో అబద్ధం ఆడవలసిన అవసరం అస్సలుండదు. వచ్చిన శవాన్ని నోర్మూసుకుని తగలెయ్యడమే!"

"కానీసార్! మీరు చంద్రమతిదేవి వచ్చినప్పుడు మీ కొడుకు శవాన్ని కాల్చటానిక్కూడా సుంకం అడిగారు కదా! అదీగాక చంద్రమతీదేవిని దొంగగా రాజు తీర్పు చెబితే చంపటానిక్కూడా వెనకాడలేదే" అన్నాడు హరిశ్చంద్రరావ్.

"అదేనోయ్ గొప్ప రాజకీయం! మంత్రి కాకముందు ఊరూరా తిరిగి అనాథప్రజల్తో సహపంక్తి భోజనంచేసిన నాయకుడు మంత్రయ్యాక కూడా అలాగే చేస్తున్నాడా? చేయడు! ఎందుకంటే బోల్డంత టైమ్ ప్రాబ్లమ్! తన మంత్రిత్వాన్ని నిలబెట్టుకోవడంకోసమే తనకి తీరికలేకుండా పోతుంది గదా! అలాగే

యిదంతా విశ్వామిత్రుడాడిన నాటకం అని నేను ముందే గ్రహించాను. అయి నకి నాతో నాటకమాడ్డమే తప్ప మరేం పని లేదేమిటి! అందుకే ఆ రోజు చంద్ర మతి రాగానే కథ ముగింపుకొచ్చిందని గ్రహించాను. పెళ్ళాన్ని చంపటం బాధ కలిగే విషయమైనా క్లయిమాక్సు కదాని కాస్త ఓపికపట్టాను. అంతే! అంతా కిందకు దిగొచ్చి శుభం పలికారు. కాబట్టి నేను చెప్పేదేమిటంటే — నెంబర్ వన్— పెళ్ళాంమాటలు పట్టుకుని తల బద్దలు కొట్టుకోవాల్సిన అవసరం లేదు. నెంబర్ టూ— మన నిజాయితీ బుజువయ్యే పరిస్థితుల్ని మనమే కలుగజేసుకోవాలిగాని ప్రతిక్షణం మన నిజాయితీకి పరీక్షలు తటస్థపడే పరిస్థితులు ఏర్పరచుకోగూడదు — నిన్ను వేధించుకు తింటున్న సమస్యకు సమాధానం చెప్పనా!"

"అక్కర్లేదు గురూగారూ! అంతా అర్థమైపోయింది."

"ఏమర్థమైంది?"

"ఇప్పుడు నేను పనిచేస్తున్న సీటు నుంచి మరో సీటుకి మారిపోతే, యీ అప్పులిచ్చే సమస్యే వుండదు. లంచం తీసుకోవాల్సిన అవసరమూ అవకాశమూ వుండదు."

"సెహభాష్! ఇహ గెలుపు నీదే! విజయీభవ!" అంటూ హరిశ్చంద్రుడు అదృశ్యమైపోయాడు.

* * *

"ఏమండోయ్! పాలు తేవాలి లేవండి! మళ్ళీ కాఫీ లేకపోతే పెద్దచావు మీతో!" హరిశ్చంద్రరావ్ భార్య లేపింది.

హరిశ్చంద్రరావ్ కళ్ళు తెరిచి చూశాడు.

గోడమీద బల్లి అలాగే వుంది. కాని ఎదురుగావున్న పురుగు మాత్రం అక్కడ లేదు. దూరంగా తీరువామీద వాలి రెక్కలాడిస్తోంది. ఇప్పుడు దానికి బల్లితో భయంలేదు.

హరిశ్చంద్రరావ్ పాలు తేవటానికి హుషారుగా లేచాడు.

